# ఊరు వెలుపల బావి

మేకా మన్మధరావు



ఊరికి వెలుపల వెలసి బావి ఒకటుంది
ఊరునే వెలివేసి ఆ బావి నిలుచుంది
మంచి మనసును మించు నిడుపాటి లోతు
సంకుచిత మెరుగని సజ్జనుని ప్రతిరూపు

వరల చావిడిలోని రావినీడల బడిని
పవలంత పలుకకా నిదురపోతుంది
నిశిరేయి వినిపించు ఘూకంపు అరుపునకు
వళ్ళు విరుచుకొని కళ్ళు నులుముకొంటుంది ॥

కీచురాయిలు చెప్పు కంచికెళ్ళని కథను
వేడుకగ గొంతెత్తి "ఊ"....కొడుతు వింటుంది.
నాచురాయిని దుముకు చిరుకప్ప గెంతునకు
తృళ్ళిపడి—తృప్తితో గలగలా నవ్వుకొంటుంది

కన్నెగా తల్లియైన కామాక్షి కూతుర్ని
అన్నమే నోచని వామాక్షి సంతతిని
త్రాగుబోతౌ వాని. ఆలు రత్తమ్మకు
తల్లియై ఒడిచేర్చి నిదురపుచ్చింది
తండ్రియై తను నిలచి శాంతి కూర్చింది

బావి మనసు నెరిగిన రావి
బావికి నీడగా నిలచింది
రావికి రక్తమిచ్చిన బావి
రావికి తోడుగా కుదిరింది

అది దెయ్యాల బావి యని
వాడంత గుసగుసలు ।
ఇది దేవతా దీవి యని
పక్షి తతి కిలకిలలు ॥

వాడ బావిని విడిచె పాడుపడె నంచునూ ।
బావి వాడను విడిచె మానవత లేదంచు ॥

(నవ్యభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ఇచ్ఛాపురం. శ్రీకాకుళం జిల్లావారి చతుర్థ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన వచన కవితల పోటీలో ప్రథమ బహుమతి కవిత)